
# బతుకు పాట

"జో అచ్యుతానంద జో జో ముకుందా, లాలి పరమానంద లాలి గోవిందా, జోజో" అని అమ్మ నా వీపుమీద జోకొడుతూ పాడినప్పుడు ఏదో హాయి అనుభవిస్తూ నెమ్మదిగా నిద్రలోకి జారిపోయింది నేనే.

"చందమామ రావె, జాబిల్లి రావె, కొండెక్కి రావె, గోగుపూలు తేవె" అని వెండి వెన్నెల వాకిట్లో అమ్మమ్మ పాడుతూ నన్ను ఆడిస్తున్నప్పుడు బోసినవ్వులు రువ్వుతూ చిట్టి చేతులు ఊపుతూ చందమామను రారమ్మని పిలిచింది నేనే.



"అదివో అల్లదివో, శ్రీహరి వాసము, పదివేల శేషుల పడగల మయము" అని శోభారాజ్ పాడుతుండగా విని ఆనందించింది నేనే. పెద్దప్పుడు నే విన్న ఈ పాట రాసిన అన్నమయ్యే, నేను చిన్నప్పుడు ఆనందించిన జో అచ్యుతానంద, చందమామ రావే పాటలు అచ్చ తెలుగు పదాలతో రాశాడని తెలుసుకుని ఆశ్చర్యపడిందీ నేనే.

"ఏరువాక సాగారోరన్నో చిన్నన్నా, నీ కష్టమంతా తీరునురోరన్నో చిన్నన్న, చద్ది అన్నమును మూటగట్టుకుని, ముల్లుగర్రను చేతపట్టుకుని, ఎలపడ దాపడ ఎడ్లు తోలుకుని, సాలు తప్పక కొంద్ర వేసుకొని, ఏరువాక సాగారోరన్నా" పాటవిని మా పొలం, మా ఎడ్లు, మా ఊరు, తలచుకుంటూ అక్కడ ఉన్నందుకు ఉబ్బితబ్బిబ్బయింది నేనే. అప్పటికి ఆ పాట ఉన్న 'రోజులు మారాయి' సినిమా చూడకపోయినా అది రాసింది కొసరాజు అనీ సంగీత దర్శకుడు మాస్టర్ వేణు అనీ తెలిసి వాళ్ళనెంతో అభిమానించింది నేనే. ఆ పాట విన్న పాతికేళ్ళకో, ముప్పై ఏళ్ళకో టీవీలో జిక్కి ఇంటర్వ్యూను చూస్తూ, ఆమె నాకిష్టమైన ఏరువాక సాగారో పాటను అనాయాసంగా పాడినప్పుడు ముచ్చటపడిపోయి, మారని ఆ మధుర గళానికి మనసులోనే నమస్కరించింది నేనే.

అదే జిక్కి, "రాగమున అనురాగ మొలికి రక్తినొసగును గానం" అని ఆలాపించినప్పుడు ఎంతో ప్రశాంతత పొందింది నేనే. "రేపు రేపు అను తీపి కలలతో రూపమిచ్చును గానం" అని తన విలక్షణ గళాన్ని విప్పినప్పుడు బంగారు భవితను ఊహించింది నేనే.

"ఛాంగురే ఛాంగు ఛాంగురే బంగారు రాజా..." అని జిక్కితన గొంతులో హొయలు పోయినప్పుడూ ఆ శృంగారపు విరుపులకు ఉక్కిరి బిక్కిరయ్యింది నేనే.

"జయకృష్ణా ముకుందా మురారీ" అని ఘంటసాల తన్మయత్వంతో పాడిప్పుడు ఆ గానానికి పరవశించింది నేనే. 'పాడుతా తీయగా చల్లగా, పసిపాపలా నిదురపో తల్లిగా' పాట విని దానిని రాసిన ఆత్రేయనూ, పాడిన ఘంటసాలనూ బాణీ కట్టిన మహదేవన్‌నూ తెగ మెచ్చుకున్నది నేనే.

"నీ సుఖమే నే కోరుకున్నా నిను వీడి అందుకే వెళుతున్నా" పాట వింటూ ఘంటసాల, ఆత్రేయ, మాస్టర్ వేణులను అభిమానంతో అక్కున చేర్చుకున్నది నేనే. "అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని

ఆగవు కొన్ని, జరిగేవన్నీ మంచికని, అనుకోవడమే మనిషి పని" వింటూ కొన్ని నిరాశామయ సందర్భాల నుంచి స్థయిర్యాన్ని తెచ్చుకున్నది నేనే.

"ఏటిలోని కెరటాలు ఏరు విడిచిపోవు, ఎదలోపలి మమకారం ఎక్కడికీ పోదు" పాట బాల మురళీకృష్ణ నోట విని మానవ సంబంధాలను నెమరు వేసుకున్నది నేనే. "మౌనమె నీభాష ఓమూగ మనసా" పాటను అదే భావోద్వేగ గళం నుంచి విని వికలమై పోయింది నేనే.

"పలుకే బంగారమాయెరా", "థిల్లానా" వంటి కృతుల్ని అలవోకగా పాడుతున్న బాలమురళిని ఆయన కచేరీలో చూసి మురిసిపోయింది నేనే. ఎంత కష్టమైన రాగాన్నయినా పాడేటప్పుడు ఆ కష్టం బయటికి కనిపించకుండా పాడడం గొప్ప కళాకారుని లక్షణమని తెలుసుకుని మనసులోనే అభినందించింది నేనే.

'మేడంటే మేడా కాదు, గూడంటే గూడూ కాదు. పదిలంగా అల్లుకున్న పొదరిల్లు మాది' పాట పాడిన అప్పటి కొత్త గాయకుడు బాలసుబ్రహ్మణ్యం తీయని గొంతు విని మైమరిచిపోయింది నేనే. అతని ప్రయోగశీలత్వాన్ని ప్రశంసించింది నేనే. ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకు విశాఖపట్నంలో ఓ సంగీత విభావరిలో "ఆగదు ఆగదు ఆగదు ఏ నిమిషము నీ కోసము, ఆగితే సాగదు ఈ లోకము" పాటను చిర్నవ్వు ముఖంతో విషాదాన్ని ఒలికించిన బాలు ఈజ్‌కు నివ్వెరపోయింది నేనే.

"సాగవయ్యా ఏరువాక, ఆపవయ్యా కరువుల రాక" పాట విన్న చాలాకాలానికి సీనియర్ నాజర్ ఇంటర్వ్యూను టీవీలో చూసి సంతోషపడింది నేనే. ఓ హిందూస్తానీ నాదస్వర విద్వాంసుడే తనకు స్ఫూర్తి అని ఆయన అన్నప్పుడు సంగీతానికి ఎల్లలు లేవనుకున్నది నేనే. 'జనపదా'ల నుంచే ఎన్నో బాణీలను కట్టేనని నాజర్ చెప్పినప్పుడు ఆ మూలాలు గ్రహించిందీ నేనే.

"పోరు పదే జాతర, శ్రీకాకుళయాతర" పాటను పాతికేళ్ళ క్రితం విశాఖలో గద్దర్ గళం నుంచి మొదటిసారి విన్నప్పుడు ఆవేశంతో ఊగిపోయింది నేనే. ఆ తర్వాత కొన్నేళ్ళకు మరో ప్రదర్శనలో అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ, చెరబండరాజూ... అరుణ దండాలు, పాదాపాదన పోరు దండాలు అంటూ ముందుకొంగి, కాళ్ళ గజ్జెలు ఘల్లుమనిపిస్తూ, చేతులు కిందకి చాచుతూ పాదాభివందనం చేస్తున్న గద్దర్‌ను చూసి, అతనికి లోలోపల పాదాభివందనం చేసింది నేనే. "భద్రం కొడుకో, జర పదిలం కొడుకో" అంటూ "పేదలున్న ఇళ్ళల్లో బాధలెన్నో ఉన్నాయి" అని నిజాలు చెప్పే ఆయన గొంతుతో లోలోపల గొంతు కలిపింది నేనే.

ఎవరి మేలుకోసం ఎన్నో వదులుకొని తాము పోరాడుతున్నారో వారిని ఉద్దేశించి "మము చంపుకున్నా మీ దయే, మము ఆదుకున్నా మీ దయే" అని పాడిన గద్దర్ గళం చెవుల్లో గింగురుమంటోంది. ఆ రూపం కళ్ళముందు కదులుతోంది. ఎందరో గొప్ప కళాకారులలాగే గద్దర్ కూడా తన కులానికి మాత్రమే చెందినవాడు కాదు, అందరి వాడు. తన పాటతో కన్నీళ్ళు తుడిచేవాడు. భుజం తట్టి బతుకు దారి చూపించేవాడు. నిన్ను నీకు చూపించి దన్నుగా నిలిచేవాడు.

జనం గుండె చప్పుళ్లను కళాత్మకంగా వినిపించే గొప్ప కళాకారుని సుమధుర సుందర కంఠస్వరంపై కత్తిదూయడం అమానుషత్వం. గజ్జెకట్టి, వేదికపై వేగంగా కదిలి, ఎగిరి, తన శరీరంతో కూడా మాట్లాడే గద్దర్‌పై తూటాలు పేల్చడం లజ్జాకరం, పైశాచికత్వం. ప్రజల పాటను ఏ తూటా ఆపలేదు.

11-4-97, వార్త దినపత్రిక